# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# శాశ్వత పరిష్కారమేది?

**రాజ్యాల** మధ్య జరిగే యుద్ధం ఎప్పుడూ రక్తదాహాన్నే కోరుకుంటుంది. గాజా యుద్ధం అందుకు మినహాయింపేమీ కాదు. అక్కడ నిత్యం తల్లి పేగు ఛిద్రమవుతున్నది. బాల్యం భగ్నమవుతున్నది. నెత్తురు ఏరులై పారుతుంటే కన్నీరు తుఫానుగా మారుతున్నది. అమెరికా ఇప్పటికైనా తన ధోరణి మార్చుకొని గాజా ఘోరకలిని ఆపేందుకు పకడ్బందీ ప్రతిపాదనలతో ముందుకురావాలి. ఇజ్రాయెల్ తన మొండి వైఖరిని వీడి పాలస్తీనీయుల ప్రజాస్వామిక, సార్వభౌమిక హక్కులను గుర్తించేందుకు సిద్ధం కావాలి. ఇజ్రాయెల్‌లోనూ యుద్ధ వ్యతిరేకత అంతకంతకూ పెరుగుతున్న పరిస్థితి మనం చూస్తున్నాం. లక్షల మంది ఇజ్రాయెల్ పౌరులు యుద్ధ భయం కారణంగా స్వదేశంలోనే చెల్లాచెదురైపోవడం తెలిసిందే. అంతేకాకుండా రిజర్వ్ సైనికులు విధుల్లోకి చేరేందుకు నిరాకరిస్తుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో.. భయతారకమైన పరిష్కారాన్ని కనిపెట్టడమే అందరికీ శ్రేయస్కరం. అందుకు అందరికన్నా ఎక్కువ చొరవ తీసుకోవాల్సింది అమెరికాయేనని చెప్పక తప్పదు. ఏకైక అగ్రరాజ్యం మధ్యవర్తిత్వం వహిస్తే గానీ ఇజ్రాయెల్-పాలస్తీనా సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కదు.

గాజాలో ఏడాది కాలానికి పైగా కొనసాగుతున్న మానవ హననం ముగింపును ఇప్పుడు యాహ్యా సిన్వర్ మరణంతో ముడిపెడుతున్నారు. హమాస్ మిలిటరీ వింగ్ నాయకుడైన సిన్వర్ గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై క్షిపణులతో జరిగిన దుస్సాహసిక దాడికి నేతృత్వం వహించాడట! సిన్వర్‌ను తుద ముట్టించడమే తమ అంతిమ లక్ష్యమని ఇజ్రాయెల్ పదే పదే చెప్పుకొన్నప్పటికీ అతడు మరణించింది మాత్రం, ప్రణాళిక ప్రకారం జరిగిన దాడిలో కాదు. ఒక ఇజ్రాయెల్ పటాలానికి అనుకోకుండా అతడు తారసపడగా కిందిస్థాయి సైనికులు అతడిని హతమార్చారు. ఇజ్రాయెల్ ఎన్నాళ్లుగానో సిన్వర్ కోసం గాలిస్తున్నప్పటికీ అతడు పట్టుబడలేదు. ఓ భవనం శిథిలాల మధ్య కూర్చున్న సిన్వర్‌ను డ్రోన్ సాయంతో గుర్తించి పట్టుకొని చంపేశారు. సిన్వర్ మృతితో ఇజ్రాయెల్ లక్ష్యం నెరవేరింది గనుక గాజాలో కాల్పుల విరమణ జరగాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అంటున్నారు. అయితే, హమాస్ చేతిలోని బందీలను విడిపించేంతవరకు యుద్ధం కొనసాగుతుందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నేతన్యాహు సెలవిచ్చారు. బందీలను తమకు అప్పగిస్తే ఈ క్షణమే యుద్ధం ఆపేస్తామని ఆఫర్ కూడా ఇచ్చారు. గాజాలో ఏడాది కాలంగా కొనసాగిస్తున్న నరమేధానికి ఒక వ్యక్తి చావుతో ముగింపు పలకాలన్న ఆలోచన వింతగా అనిపిస్తున్నది. గాజా యుద్ధాన్ని తేలికైన అంశంగా చూస్తున్నట్టు అనిపించడమే అందుకు కారణం. అయితే 40,000 మందికి పైగా సామాన్యులు హతమైపోయిన నరమేధానికి ఎవరు బాధ్యత వహిస్తారనేది అసలు ప్రశ్న. ఇజ్రాయెల్ తన ఘాతుక యుద్ధాన్ని ఆపివేస్తేనే బందీలను విడుదల చేస్తామని అటు హమాస్ ప్రకటించింది. అంటే హమాస్ బందీలను విడవదు, ఇజ్రాయెల్ యుద్ధం ఆపదు. ఈ విష వలయంలో సామాన్యులు నలిగి నలిగిపోతుండటం అత్యంత విషాదకరమైన విషయం.

పాలస్తీనా సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనేంతవరకు సిన్వర్‌లు పుడుతూనే ఉంటారు, గిడుతూనే ఉంటారు. ఇజ్రాయెల్ దురాక్రమణ ఆగిన రోజు పశ్చిమాసియాలో శాశ్వత శాంతి నెలకొంటుందని చెప్పవచ్చు. కొన్ని గ్రూపులు తప్ప ఈ సమస్య నుంచి అరబ్ దేశాలు దూరంగా జరిగి పట్టించుకోవడం మానేశాయి. పైగా ఇజ్రాయెల్‌తో ఏదో ఒకరకంగా సంబంధాలు పెట్టుకునేందుకు తహతహలాడుతున్నాయి. ఒక్క ఇరాన్ మాత్రమే ఇప్పుడు పాలస్తీనాకు అండగా నిలుస్తున్నది. దీని పర్యవసానంగా ఇరాన్ మీదకు ఇజ్రాయెల్ దండెత్తే పరిస్థితులు వస్తున్నాయి. రోజురోజుకూ సమస్య మరింత ముదురుతున్నదే తప్ప కొలిక్కి వస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. పెద్దన్న అమెరికా పాత్ర కూడా ప్రశ్నార్థకం అవుతున్నది. పైకి యుద్ధాన్ని వ్యతిరేకిస్తూనే అమెరికా ఇజ్రాయెల్‌కు సమర్థనగా నిలవడం, ఆయుధ సంపత్తి సమకూర్చడం బహిరంగ రహస్యమే. ఇంతటి సంక్లిష్ట వాతావరణంలోనూ మొత్తం మీద యుద్ధం ముగింపునకు సంబంధించిన మాటలు అటు అమెరికా నోట, ఇటు ఇజ్రాయెల్ నోటా వినిపించడమే కొంతలో కొంత ఊరట!

# ఒమర్.. రాష్ట్ర హోదా సాధించేనా?



నాంచారయ్య మెరుగుమాల

**భారతదేశంలో నూతన కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా కొత్తగా ప్రమాణం చేసిన నేషనల్ కాన్ఫరెన్స్ మూడో తరం నేత ఒమర్ అబ్దుల్లాది ఇతర ముఖ్యమంత్రులెవరికీ లేని అపూర్వ పరిస్థితి. జమ్మూకశ్మీర్‌లో ఎన్నికైన తొలి ముఖ్యమంత్రి షేక్ అబ్దుల్లా మనవడు, ప్రస్తుత ఎన్సీ అధ్యక్షుడు, మాజీ సీఎం ఫారూఖ్ అబ్దుల్లా కుమారుడైన 54 ఏండ్ల ఒమర్ కేంద్రపాలిత ప్రాంత ముఖ్యమంత్రిగా ఇటీవల ప్రమాణం చేశారు.**




ఒమర్ తాత షేక్ అబ్దుల్లా జమ్మూకశ్మీర్ తొలి ముఖ్యమంత్రి. షేక్ మరణానంతరం ఆయన కుమారుడు డాక్టర్ ఫారూఖ్ అబ్దుల్లా (ఇప్పుడు వయస్సు 87) కూడా తండ్రి మాదిరిగానే మూడు సార్లు కల్లోలిత కశ్మీరానికి ముఖ్యమంత్రిగా సేవలందించారు. డాక్టర్ ఫారూఖ్ కుమారుడు, మూడో తరం అబ్దుల్లా అయిన ఒమర్ కూడా కశ్మీర్ ప్రత్యేక హోదా కలిగిన పూర్తిస్థాయి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఆరేండ్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. మూడు తరాలకు చెందిన ఈ ముగ్గురు అబ్దుల్లాలు 1948 నుంచి 2015 జనవరి 8 వరకూ దాదాపు 30 ఏండ్లు ముఖ్యమంత్రి పదవిలో రాష్ట్రాన్ని వివిధ దశల్లో పాలించారు. ఇలా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఒక రాష్ట్రంలో సీఎం పదవి చేపట్టడం ఇదే మొదటిసారి. ప్రత్యేక రాజకీయ, సామాజిక, భౌగోళిక పరిస్థితులున్న కశ్మీర్‌లో ఇది సాధ్యమైందని భావించవచ్చు. అయితే, స్వల్పంగా భూభాగం తగ్గిన నూతన కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా ముందు ఇప్పుడు ఏ ముఖ్యమంత్రికీ లేని ప్రత్యేక సవాళ్లున్నాయి.

జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి (అటానమీ) లేదా ప్రత్యేక హోదా కల్పించే రాజ్యాంగ అధికరణ 370ను భారత రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా తొలగించారు. తర్వాత భారత పార్లమెంటు చట్టం ద్వారా జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌ను రెండు వేర్వేరు ప్రాంతాలుగా విడదీసి వాటిని కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చడంతో అక్కడ ఎన్నికలు జరపడం మొదట ప్రధానాంశమైంది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఇటీవల జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరిపించారు, 90 మంది సభ్యులున్న అసెంబ్లీలో జమ్మూకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్‌కు సొంతంగా మెజారిటీ రాకపోవడంతో కాంగ్రెస్ వెలుపలి నుంచి ఇచ్చే మద్దతుతో రాష్ట్ర మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలో ఎన్సీ సర్కార్ అధికారంలోకి వచ్చింది.

**రాష్ట్ర హోదా కోల్పోవడంతో ఇదివరకు కశ్మీర్‌కు ఉన్న శాసనమండలి (విధాన పరిషత్తు) కూడా రద్దయింది. దీంతో కశ్మీర్ మంత్రిమండలి సభ్యుల సంఖ్య తగ్గిపోవడంతో మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు కోరినన్ని మంత్రి పదవులు ఇవ్వడం సాధ్యం కాదని ఒమర్ తేల్చిచెప్పారు. ఫలితంగా, హస్తం పార్టీ బయటినుంచి మద్దతు ఇవ్వాలని నిర్ణయించింది. కేంద్రపాలిత ప్రాంతంగా మారడం వల్ల ఇలా అనేక సమస్యలు తలెత్తుతున్నాయి.**

కేంద్రంలో కాంగ్రెస్ లేదా బీజేపీ ఏది అధికారం చెలాయిస్తున్నా.. సాధారణ పరిస్థితులు ఉండే ఇతర రాష్ట్రాల్లో సైతం గవర్నర్ల పెత్తనం ఏ స్థాయిలో ఉంటుందో చూస్తూనే ఉన్నాం. ఇక జమ్మూకశ్మీర్‌లో వివాదాస్పద గవర్నర్ జగ్‌మోహన్ నుంచి పలువురు గవర్నర్లు రాష్ట్ర సర్కార్లను సతాయించినవారే. కేంద్ర ప్రభుత్వాల కనుసన్నల్లో మెలుగుతూ కాంగ్రెస్, బీజేపీ నాయకత్వంలోని కేంద్ర సర్కార్ల ఆదేశానుసారం వారు వ్యవహరించిన తీరు ప్రజలు ఇంకా మరిచిపోలేదు. ఏదైనా కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ, ముఖ్యమంత్రి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దాని లెఫ్టినెంట్ గవర్నర్లు ఎలా సీఎంపై పెత్తనం చేయడానికి ప్రయత్నిస్తారో గత కొన్నేండ్లుగా ఢిల్లీలో చూస్తూనే ఉన్నాం.

**ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా ఉండగా, ఆ తర్వాత ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్లు తమ అధికారాన్ని ఏ స్థాయిలో చెలాయించారో రుజువు చేశారు. మరి ఈ లెక్కన తీవ్రవాదం, పొరుగు దేశంతో తరచూ ఉద్రిక్తతలు నెలకొనే పరిస్థితులున్న సరిహద్దు ప్రాంతం జమ్మూ కశ్మీర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ వ్యవహారశైలిని బట్టి ఒమర్ అబ్దుల్లా పాలన ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే 370వ అధికరణ పునరుద్ధరించాలని కోరుతూ ఒమర్ అబ్దుల్లా మంత్రివర్గం అసెంబ్లీ తీర్మానం చేయించాలని నిర్ణయించింది.**

ఈ తీర్మానం కేంద్రపాలిత ప్రాంత శాసనసభ ఆమోదించి లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్రానికి పంపితే అది ఎంతవరకు ఆచరణ రూపం దాల్చుతుందో ఊహించడం కష్టం కాదు. అదీగాక, జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా ఇవ్వడానికి కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ సుముఖమే గానీ, అది ఎప్పుడు చేస్తారో చెప్పడం కష్టం. ఇక ప్రత్యేక హోదా ప్రసాదించే 370 అధికరణ పునరుద్ధరించడానికి జాతీయ పక్షాలు రెండు అనుకూలంగా లేవు. ఇన్ని అననుకూల పరిస్థితుల మధ్య నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం సజావుగా ముందుకు సాగడానికి ఇంకా ఎన్నో సవాళ్లు కనిపిస్తున్నాయి. 90 మంది ఎన్నికైన ఎమ్మెల్యేలు, గవర్నర్ నామినేట్ చేసిన ఐదుగురు ఎమ్మెల్యేలతో ఏర్పడిన ఈ కేంద్రపాలిత ప్రాంత అసెంబ్లీకి పరిమిత అధికారాలే ఉన్నాయి. లెజిస్లేటివ్ కౌన్సిల్ లేకపోవడంతో ముఖ్యమంత్రి ఇంకా తన క్యాబినెట్‌లోకి తొమ్మిది మందిని మాత్రమే తీసుకునే అవకాశం ఉన్నది. అయితే, ఇప్పటికే ఒమర్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు ఆశావహంగా ఉన్నాయి. హిందువుల జనాభా ఎక్కువగా ఉండి, 43 మంది సభ్యులు కలిగి ఉన్న జమ్మూ ప్రాంతం నుంచి తన పార్టీకి చెందిన హిందూ నేత సురీందర్‌సింగ్ చౌదరీని ఉప ముఖ్యమంత్రిగా ఆయన నియమించుకున్నారు.

ఇంకా ముస్లింలు కూడా ఒక మోస్తరు సంఖ్యలో ఉన్న ఈ ప్రాంతానికి చెందిన సతీశ్ శర్మ, జావేద్ రాణాకు కూడా క్యాబినెట్‌లో స్థానం కల్పించి మతాలవారీగా సమతూకం పాటించే ప్రయత్నం చేశారు ఒమర్. అయితే, కశ్మీర్‌లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తన చెప్పుచేతుల్లో ఉండేవిధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. ఇటీవల ప్రవేశపెట్టిన జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రభుత్వ పరిపాలనా నియమాలు (రెండో సవరణ) 2024 జూలై 12 ప్రకారం లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాలు మరింత విస్తృతమయ్యాయి.

లెఫ్టినెంట్ గవర్నర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారాలు అపరిమితంగా పెరుగుతూ పోయే పాలనావ్యవస్థను కశ్మీర్‌లో ఏర్పాటు చేయడానికి కేంద్ర సర్కార్ ప్రయత్నిస్తున్న క్రమంలో ఒమర్ అబ్దుల్లా సర్కారు ప్రజలకు గాని, దేశానికి గాని చేయగలిగింది పెద్దగా ఏమీ కనిపించడం లేదని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. కశ్మీర్‌లో కుటుంబ మూలాలున్న తొలి భారత ప్రధాని పండిత నెహ్రూ దగ్గరినుంచి ఆయన మనవడు రాజీవ్‌గాంధీ వరకూ, ఇంకా పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు జమ్మూకశ్మీర్‌పై తమ పట్టును, నియంత్రణను పెంచుకుంటూ పోయాయే గానీ తగ్గించనే లేదు, బీజేపీ ప్రధానులు ఏబీ వాజపేయి, నరేంద్ర మోదీ సర్కార్లదీ ఇదే ధోరణి. ఈ వాస్తవాలను గుర్తించిన ఒమర్ అబ్దుల్లా మరి భవిష్యత్తులు జమ్మూకశ్మీర్‌కు కనీసం రాష్ట్ర హోదా సాధించినా దాన్ని గొప్ప విజయంగా పరిగణించవచ్చు.



# నిరుద్యోగుల కన్నీళ్లు ఆగేదెప్పుడు?



డాక్టర్
కేతిరెడ్డి వాసుదేవరెడ్డి
95530 86666

**ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల రాష్ట్రంలో అగ్గి రాజుకున్నది. విద్యార్థులు పోరుబాట పట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 29నే ఇందుకు ప్రధాన కారణం. గ్రూప్-1 పరీక్షలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగుల రిజర్వేషన్లకు జీవో నెంబర్ 29 పెద్ద అడ్డంకిగా మారింది. అందుకే గ్రూప్-1 అభ్యర్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనా కార్యక్రమాలు చేపడుతున్నారు. అయినా, జీవో 29ని పక్కనపెట్టి, జీవో 55ను అమలుచేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు ముందుకురావడం లేదు. పైగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేస్తూ, వారిని జైళ్లలో పెడుతూ పైశాచికానందాన్ని పొందుతున్నది.**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 29 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, దివ్యాంగులకు తీవ్ర అన్యాయం జరుగనున్నది. అగ్రవర్ణాల విద్యార్థులకు ఎక్కువ మార్కులు వచ్చినప్పటికీ వారిని జనరల్‌గా పరిగణించడం లేదు. వారికి రిజర్వేషన్ వర్తింపజేయడం వల్ల మరో రిజర్వ్ అభ్యర్థికి అవకాశం లేకుండా పోతున్నది. అంతేకాదు, గత బీఆర్ఎస్ సర్కారు తీసుకువచ్చిన 95 శాతం లోకల్ రిజర్వేషన్‌ను కూడా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కింది. దీంతో ఇతర రాష్ట్ర విద్యార్థులకు ఎర్ర తివాచీ పరిచినట్టయిందని నిరుద్యోగులు గోడు వెళ్లబోసుకుంటున్నారు. అయినా, రాష్ట్ర ప్రభుత్వం 'నేను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు' అన్నట్టుగా వ్యవహరిస్తున్నది.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో 55 ప్రకారం అన్నివర్గాల నిరుద్యోగులకు, విద్యార్థులకు న్యాయం చేసింది. అంతేకాదు, యూపీఎస్సీ విధానాన్ని సైతం అమలు చేసింది. మరి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలుచేయడం లేదో అంతుచిక్కడం లేదు. గ్రూప్-1 అభ్యర్థులను పిలిచి, వారు అడుగుతున్న సహేతుకమైన ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. జీవో 29 పట్ల రాష్ట్ర ప్రభుత్వానికే స్పష్టమైన అవగాహన లేనప్పుడు నిరుద్యోగ అభ్యర్థులకు ఏం సమాధానం చెప్తుందని సామాజిక మాధ్యమాల్లో మేధావులు విశ్లేషిస్తుండటం ప్రభుత్వ అసమర్థతను తెలియజేస్తున్నది. ఇదిలా ఉంటే, నిరుద్యోగ విద్యార్థులు గత కొన్నేండ్లుగా తెలుగు అకాడమీ పుస్తకాలను ప్రామాణికంగా తీసుకొని పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. కానీ, ఇప్పటినుంచి వికీపీడియాను ప్రామాణికంగా తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అర్థం లేని, వితండ వాదన చేస్తున్నది. రేవంత్ ప్రభుత్వం ఎప్పుడు, ఏ నిర్ణయం తీసుకుంటున్నదో అర్థం కాని పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నదని గ్రూప్-1 అభ్యర్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**మార్పు పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ బతుకులను బుగ్గిపాలు చేస్తున్నదని నిరుద్యోగ, గ్రూప్-1 అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే జీవో 29ను పక్కనపెట్టాలని విద్యార్థులు తమదైన శైలిలో నిరసనలను తెలియజేస్తున్నారు. వారిలో కాబోయే డీఎస్పీలు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు ఉన్నారు. అలాంటి వారి పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, పోలీసుల వైఖరి దురుసుగా ఉంటున్నది. తెలంగాణ భవిష్యత్తుకు సారథులుగా నిలిచే గ్రూపు-1 అభ్యర్థులనే ఇలా ఇబ్బందులకు గురిచేస్తున్నదంటే మామూలు ప్రజల పరిస్థితి ఏమిటో మనం ఊహించుకోవచ్చు. రోడ్డెక్కిన ఉద్యోగార్థులను పోలీసులు గొడ్డును బాదినట్టు బాదడం సబబేనా? ఆడపిల్లలని కూడా చూడకుండా వారిని, అర్ధరాత్రి దాకా పోలీస్‌స్టేషన్‌లో పెట్టడం న్యాయమేనా?**

ఇదిలా ఉంటే.. రాష్ట్ర బీజేపీ నాయకులు భిన్న వైఖరి ప్రదర్శిస్తున్నారు. విద్యార్థుల తరపున పోరాడాల్సిన బీజేపీ నాయకులు ప్రభుత్వానికే వత్తాసు పలుకుతుండటం నిజంగా సిగ్గుచేటు. ఇటు గ్రూప్-1 అభ్యర్థులకు, అటు ప్రభుత్వానికి మధ్య వారధిలా వ్యవహరించి సమస్యను సద్దుమణిగించే ప్రయత్నం చేయాల్సిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మరింత దుమారం లేపుతున్నాడు. మొదటి నుంచి విద్యార్థుల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీని విమర్శిస్తూ రాజకీయం చేయడం ఆయన అజ్ఞానానికి పరాకాష్ఠగా చెప్పుకోవచ్చు. గ్రూప్-1 విద్యార్థుల తరపున పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీకి క్రెడిట్ ఎక్కడ దక్కుతుందో అన్నదే ఆయన తాపత్రయం. అంతేకాదు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆ సీటు నుంచి తప్పించాలని రాష్ట్ర మంత్రులు ప్రయత్నిస్తున్నారని బండి వ్యాఖ్యానించడం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందాన్ని తెలియజేస్తున్నది.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో 29ను పక్కనపెట్టి ఈ సమస్యకు ఇంతటితో స్వస్తి పలకాలి. లేకుంటే నిరుద్యోగుల లొల్లి ఢిల్లీకి పాకినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు అశోక్‌నగర్‌లో ప్రచారం చేసిన రాహుల్‌గాంధీ ఇంటిని ముట్టడి చేసేందుకు నిరుద్యోగ అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి లోకానికి నేను చెప్పేదేమంటే... మీరు ధైర్యాన్ని కోల్పోవద్దు. ప్రస్తుతానికి జరుగుతున్న పరీక్షలు జాగ్రత్తగా రాసి, విజయాన్ని సాధించండి. కొట్లాడటం, ఉద్యమాలు చేయడం తెలంగాణ రక్తంలోనే ఉన్నది. మన హక్కులను మనం సాధించుకునేదాక విశ్రమించకుండా పోరాడుదాం. మీకు కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పార్టీ మద్దతు సంపూర్ణంగా ఉంటుంది. అందులో భాగంగానే గ్రూప్-1 నిరుద్యోగ అభ్యర్థుల తరపున సుప్రీంకోర్టులో వాదించేందుకు బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే చర్యలు చేపట్టింది. అంతేకాదు, బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం అయిన 'తెలంగాణ భవన్' మీకు ఒక జనతా గ్యారేజ్‌లా పనిచేస్తుంది. ప్రతిపక్ష పార్టీగా న్యాయం కోసం తలుపు తట్టిన ప్రతి వ్యక్తికి అండగా నిలుస్తుందనడంలో ఎలాంటి సంశయం అక్కర్లేదు.

(వాసకర్త: బీఆర్ఎస్ పార్టీ నాయకులు)

# తప్పెవరిది, శిక్ష ఎవరికి?



మహ్మద్ జమీలొద్దీన్ అహ్మద్
86862 11556

'హైడ్రా'.. ఈ పేరు వింటేనే రాష్ట్ర ప్రజలు హడలెత్తుతున్నారు, హైరానా పడుతున్నారు. వాస్తవానికి 'హైడ్రా' అంటే విపత్తు నివారణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ఏర్పాటుచేసిన ఒక నోడల్ ఏజెన్సీ. కానీ, ఈ హైడ్రా తన పరిధిని మరిచి, హద్దు మీరి ప్రవర్తిస్తున్నది. చట్టానికి, రాజ్యాంగానికి, న్యాయసూత్రాలకు అతీతంగా వ్యవహరిస్తూ, ఏ కోర్టు తీర్పులు తనకు వర్తించవన్నట్టుగా దుందుడుకు స్వభావంతో వ్యవహరిస్తున్నది.


ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం కావడాన్ని, చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణలను ఎవరూ సమర్థించరు. అక్రమ నిర్మాణాలుంటే వాటిని తొలగించడాన్ని కూడా ఎవరూ వ్యతిరేకించరు. కానీ, ఎదుటివారికి వారి వాదన చెప్పుకొనే అవకాశం ఇవ్వాలన్నది మౌలిక న్యాయసూత్రం. ఈ సూత్రానికి విరుద్ధంగా, చట్టపరంగా చేపట్టవలసిన కనీస చర్యలు తీసుకోకుండా ఆక్రమణల పేరిట ఇండ్లు కూల్చివేయడాన్ని ఖండించవలసిన అవసరం ఉన్నది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయం ఏమంటే.. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో ఉన్న భూములు ప్రభుత్వానికి కావు. అవన్నీ పట్టా భూములే. ఏక్‌ఫసులా భూములు. అంటే, వేసవి కాలంలో, చెరువు నీళ్లు తగ్గినప్పుడు ఒక పంట మాత్రమే పండించుకునే భూములు. ఈ భూములను అమ్ముకోవచ్చు, కొనుక్కోవచ్చు. పట్టాదారు చనిపోతే వారసులు విరాసత్ కూడా చేసుకోవచ్చు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ భూముల్లో నిర్మాణాలు చేయవద్దనే విషయం యజమానులకే కాదు, చాలామంది అధికారులకు కూడా తెలువదు. అందుకే వాటిలో నిర్మాణాలు జరిగాయి. అదెవరి తప్పు?

**పలానా భూమి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్నదా అని నిర్ధారించే బాధ్యత నీటిపారుదల, రెవెన్యూ అధికారులది. అట్లా నిర్ధారించిన భూముల్లో నిర్మాణాలు జరగకుండా, అనుమతులు ఇవ్వకుండా చూడవలసిన బాధ్యత పంచాయతీ, మున్సిపల్ శాఖ అధికారులది. వ్యవసాయేతర, కమర్షియల్ ప్లాట్లుగా రిజిస్ట్రేషన్ చేయకుండా అడ్డుకోవలసిన బాధ్యత రిజిస్ట్రేషన్ శాఖ అధికారులది.**

కానీ, ఆయా శాఖల అధికారులు ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల, ఒకవేళ నిర్వహించినా నిబంధనలను అతిక్రమించడం వల్ల ఈ నిర్మాణాలు జరిగాయి. అధికారులే గనుక అనుమతులు ఇవ్వకుంటే అక్కడ నిర్మాణాలు జరిగేవా? అధికారులు సక్రమైనవేనని ముద్రవేస్తేనే కదా సామాన్య ప్రజలు రూపాయి రూపాయి కూడవెట్టి మరీ ఆ భూములను కొనుగోలు చేసింది? ఇండ్లు నిర్మించుకున్నది?

లేడికి లేచిందే పరుగు అన్నట్టుగా సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఆ నిర్మాణాలను కూల్చేయండని హైడ్రా అధికారులను ఉసిగొల్పడం సబబేనా? తప్పు ఎవరు చేశారు, ప్రభుత్వం శిక్ష ఎవరికి వేస్తున్నదో ఒక్కసారి అవలోకనం చేసుకోవాలి. సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు గాను తమ జీవితకాలం కష్టం చేసుకొని సంపాదించుకున్న సొమ్మును పోసి, అప్పులు చేసి ఇల్లు కొన్న వారిదా తప్పు? అనుమతులు ఇచ్చిన అధికారులదా? హైడ్రా అధికారులు అయినవారికి ఆకుల్లో, కానివారికి కంచాల్లో అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఇండ్లు నిర్మించుకున్న పెద్దలకు, ముఖ్యమంత్రి సోదరుడి ఇంటికి నోటీసులు ఇచ్చి, స్టే తెచ్చుకునే అవకాశం కల్పించిన అధికారులు పేద ప్రజలకు మాత్రం కనీసం హెచ్చరికలు కూడా చేయకపోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనం. పేద ప్రజలను ఇప్పటికిప్పుడు ఇల్లు ఖాళీచేసి వేరే చోటికి వెళ్లండి అంటే వారెక్కడికి వెళ్తారు? కాబట్టి ప్రభుత్వం చెరువుల రక్షణ కోసం పేదలను ఇక్కడినుంచి తరలించదలిస్తే వాళ్ల ముందుగా వారితో చర్చలు జరపాలి. వారికి తగిన సమయం ఇవ్వాలి. నిర్వాసితులకు తగిన పునరావాసం, నష్టపరిహారం చెల్లించాలి. అంతే కానీ, ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే ఈ ప్రభుత్వం ప్రజా తిరుగుబాటును చవిచూడటమే కాదు, ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోతుంది.






# కమలపై ఆ నమ్మకం ఉన్నది



**గెరాల్డ్ ఫోర్డ్ కోసం నేను మొదటిసారి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాను. మళ్లీ ఇప్పుడు కమలా హారిస్ కోసం పాల్గొంటున్నాను. ట్రంప్ సొంతగూటిలో ఉన్న రాజకీయ ప్రత్యర్థులపై దాడిచేస్తూ ప్రపంచంలోని అత్యంత దుర్మార్గులపై ప్రశంసల వర్షం కురిపిస్తాడు. రిపబ్లికన్ పార్టీ నిరంకుశత్వాన్ని ఆలింగనం చేసుకుంటున్నది. డెమొక్రాటిక్ పార్టీకి నేనెప్పుడూ ఓటు వేయలేదు కానీ, ఇప్పుడు వేస్తాను, ఎందుకంటే కమలా హారిస్ అమెరికా రాజ్యాంగాన్ని పరిరక్షిస్తారనే నమ్మకం నాకున్నది.**

- లిజ్ చెనినీ, రిపబ్లికన్ కాంగ్రెస్ మాజీ నేత